# ప్రతి అడుగూ ముందడుగే...

**తెలుగు వారందరికీ నమస్కారం!!!**

తెలుగు అసోసియేషన్ ఆఫ్ లండన్ (తాల్) 2005 సంవత్సరంలో స్థాపించబడినది. గడచిన ఆరు సంవత్సరాలలో తాల్ లండన్ పరిసర ప్రాంతాలలోని తెలుగువారికి సాంస్కృతిక మరియు సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తూ, నాణ్యమైన సేవలను అందిస్తున్నది. ఈ ఆరు సంవత్సరాల ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు, ప్రశంసలు, విమర్శలతో పాటు కొన్ని శోచనీయమైన మరియు శోకనీయమైన సంఘటనలు సాటి తెలుగువారితో పాలుపంచుకోవడం జరిగింది. (ఉదా: రాష్ట్రంలో సంభవించిన ప్రకృతి వైపరీత్యాలు, ఆస్తినష్టం, ప్రాణనష్టం) కానీ తెలుగువారి ఆత్మగౌరవానికి ఎక్కడా కూడా భంగం లేదా బాధ కలుగకుండా, వారి ఆత్మస్థైర్యం సడలకుండా సాధ్యమైనంత వరకు మనకు ఉన్నటువంటి మానవ మరియు ఆర్థిక వనరులను ఉపయోగించుకుంటూ తెలుగు ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్నీ, విశ్వాసాన్నీ ఎంతో బాధ్యతతో కాపాడుకుంటూ ముందుకు సాగుతోంది. 2010లో మనం తాల్ ద్వారా బ్రిటిష్ సమాజంలోని తెలుగువారికి అర్ధ దశాబ్దం నుండి చేస్తున్నటువంటి సేవలను గుర్తించి U.K. Charity Commission తాల్‌కు స్వచ్ఛంద సంస్థ హోదాని కల్పించింది. కాని ఒక మహాకవి అన్నట్లు "సాధించిన దానికి సంతృప్తిని పొంది అదే విజయమనుకుంటే సరిపోదోయి" అనే నానుడిని తాల్ అనుక్షణం స్మరించుకుంటూ వుంటుంది. ఆడంబరాలకు, ఆర్భాటాలకు సాధ్యమైనంత దూరంగా వుండాలి అనేది తాల్ ఆకాంక్ష మరియు ఆశయం కూడా.



తాల్ దైనందిన సాంస్కృతిక కార్యక్రమాలతో పాటుగా క్రీడలు, బాలల దినోత్సవాలు, మహిళల కోసం కొన్ని చర్చలు, అలాగే బ్రిటిష్ సమాజంలోని వృద్ధులకు బాసటగా నిలిచేటటువంటి కొన్ని కార్యక్రమాలు గడిచిన ఆరేళ్ళ నుండి శ్రీ డాక్టర్ దాసోజు రాములుగారు మరియు శ్రీ బి. రామానాయుడుగారి సారధ్యంలో అన్ని రంగాలకు చెందిన నిపుణులు, కళాకారులు మరియు చురుకైనటువంటి కార్యకర్తలతో కలిసి ఎంతో వినూత్నంగా నిర్వహిస్తోంది. ముఖ్యంగా వీరిద్దరు మాకు ఇచ్చిన ప్రోత్సాహం తోపాటు చూపించిన మార్గం, మమ్మల్నందరిని మీ అందరి దగ్గరకు చేర్చటంలో నిరంతరం చేసిన మరియు చేస్తున్న కృషికి మేము కృతజ్ఞతలను తెలియచేస్తున్నాము.

తాల్ పోయిన సంవత్సరం లండన్లో రెండు సాంస్కృతిక కేంద్రాలను (Telugu Cultural Centres, TCC) స్థాపించింది. వీటి ద్వారా మన

పిల్లలను, పెద్దలను తెలుగు సంస్కృతికి దగ్గరగా వుండే విధంగా కావల్సిన సంగీత, సాహిత్య, నాట్య, భాషాపరమైన విద్యా బోధన, శిక్షణ, అలాగే చర్చలు కొనసాగించటం జరుగుతుంది. లండన్ పరిసర ప్రాంత్లాలోని తెలుగు ప్రజలు, వారి పిల్లలకు తెలుగు సంస్కృతికి సంబంధించి ఈ బోధన కావాలి అంటే, వెంటనే మమ్మల్ని మా వెబ్‌సైట్ *taluk.org* లో సంప్రదించండి. తాల్ ఈ సంస్థలను విస్తరించడానికి ముఖ్య లక్ష్యంగా నడుం బిగించింది.

తాల్ ఇంకా ఎంతో ఎంతెంతో సాధించాల్సి వుంది. తెలుగు ప్రజల హృదయఘోషని, భాషనీ దానిలోని మాధుర్యాన్ని, తీయతనాన్ని ఇక్కడి ప్రజలతో పంచుకొని మునుముందుకి దినదినాభివృద్ధి చెందాలి అనేదే మనందరి ఆకాంక్ష కావాలి. మనందరం కలసికట్టుగా ఉంటేనే ఇది సాధించగలం.

తాల్ ఒక స్వచ్ఛంద సేవాసంస్థ. ఇది అనుకున్నది సాధించి అంబరానికి ఎదగాలి అంటే ప్రతి కార్యకర్త మనసులో ఎదుటి మనిషికి ఉపయోగపడాలి అనే దృఢ సంకల్పం వుండాలి. అప్పుడే ఏదైనా ఏమైనా సాధించగలం. మీ అందరి సహాయ సహకారాలతో పట్టుమని పదిమందితో 2005లో మొదలైన తాళ్ సంస్థ ఈనాడు కొన్ని వందలమంది కార్యకర్తలతో దినదినాభివృద్ధి చెందుతూ బ్రిటన్‌లో ఒక ఉన్నతమైన సంస్థగా తెలుగు సంస్కృతిని, భాషాసంపదను, సాహిత్యాన్ని, అలాగే మన సాంస్కృతిక వారసత్వాన్ని భిన్నత్వంలో ఏకత్వం అనే నానుడికి కట్టుబడి మనందరి భవిష్యత్తు అయిన మన పిల్లలకు బంగారుపళ్ళెంలో పెట్టి అందించాలి అనే దృఢ సంకల్పంతో ముందుకు సాగుతోంది.

తాల్ బ్రిటిష్ సమాజంలో నివసిస్తున్నటువంటి తెలుగువారికి సంబంధించినటువంటి సమస్యలు- ఇమ్మిగ్రేషన్, ఉద్యోగ, ఉపాధి, ఆరోగ్యం, న్యాయపరమైనటువంటి విషయాలలో ప్రాంతీయ అధికారులు మరియు ప్రజా ప్రతినిధులతో నిరంతరం పనిచేస్తూ సాధ్యమైనంతవరకు సమస్యలకు పరిష్కారమార్గాలను అందిస్తుంది. ఈ విషయంలో సాంకేతికమైనటువంటి ఒక హెల్ప్‌లైన్‌ని స్థాపించడానికి కృషి చేస్తున్నాము. దీనికి నిపుణులైనటువంటి మీ అందరి సహాయ సహకారాలు అవసరము.

తెలుగు వారందరు ఆనందంతో,అభిమానంతో అలాగే ఆత్మీయతతో, ఆరోగ్యంతో, ఐక్యతతో అభివృద్ధి చెందాలి అని "శ్రీకర నామ సంవత్సర ఉగాదిని" ఆహ్వానిస్తూ మనసా, వాచా, కర్మణా కోరుకుందాము!!!!

ఏ దేశమేగినా ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము

ఏ పూర్వ పుణ్యమో, ఏ యోగ బలమో
జనియించినాడ వీ స్వర్గఖండమున
ఏ మంచిపూవులన్ ప్రేమించినావో
నిను మోచె ఈ తల్లి కనక గర్భమున

సదా మీసేవలో...

**శ్రీధర్ వనం**, ఛైర్మన్
**మహేష్‌కుమార్ చదలవాడ**, వైస్ ఛైర్మన్
**సూర్య కందుకూరి**, ట్రెజరర్
**సంజయ్ బైర్రాజ్**, ట్రస్టీ- ఈవెంట్స్ & యాక్టివిటీస్
**మల్లేష్ కోట**, ట్రస్టీ- కమ్యూనికేషన్ ఇన్‌ఛార్జ్